సాక్షి పెద్దపల్లి

మంగళవారం ၊ 12 ၊ మార్చి ၊ 2024



మహిళలకు ఆటల పోటీలు

గోదావరిఖని: మహిళా దినోత్సవం సందర్భంగా సీఈఆర్ క్లబ్‌లో సోమవారం ఆర్జీ-2 ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ : 6.31	బుధ : 5.05

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.0/27.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎండగా ఉంటుంది. రాత్రివేళ చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నారాయణకు 'అక్యుపంక్చర్ రత్న' అవార్డు



అవార్డు అందుకుంటున్న నారాయణ

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలో అక్యుపంక్చర్ డాక్టర్‌గా గుర్తింపు పొందిన సుంక నారాయణ అక్యుపంక్చర్ రత్న అవార్డు అందుకున్నారు. నేషనల్ అక్యుపంక్చర్ డే పురస్కరించుకొని ఆదివారం కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూర్‌లో ఫెడరేషన్ ఆఫ్ అక్యుపంక్చర్ సిస్టమ్ ఆఫ్ థెరపీ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సెమినార్‌లో అక్యుపంక్చర్ రత్న అవార్డుకు నారాయణను ఎంపిక చేసినట్లు బోర్డు అధ్యక్షుడు డాక్టర్ సమియుల్లా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడుతూ అవార్డు అందజేశారు. దేశవ్యాప్తంగా కేవలం ఆరుగురు మాత్రమే అవార్డులకు ఎంపిక కాగా, ఇందులో గోదావరిఖనికి చెందిన నారాయణ కూడా ఉండడం గమనార్హం. నారాయణ అవార్డు అందుకోవడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

గృహజ్యోతిని సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ బొంకూరి సుదర్శన్ కోరారు. ప్రజాపాలన కార్యక్రమంలో అందించిన దరఖాస్తుల ఆధారంగా గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ పథకం లబ్ధిదారులకు వర్తిస్తుందన్నారు. జీరో బిల్లు రాని అర్హులైన గ్రామీణ లబ్ధిదారులు ఎంపీడీవో, పట్టణ ప్రాంతాల వారు మున్సిపల్ ఆఫీసులో వివరాలు అందించాలని సూచించారు. తెల్లరంగు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కరెంటు సర్వీస్‌నంబర్ నమోదు చేస్తే సెల్‌నంబర్‌కు ఓటీపీ వస్తుందని ఆ ఓటీపీని నమోదు చేస్తే ప్రస్తుతం ఇచ్చిన విద్యుత్‌బిల్లు జీరోగా మారుతుందని వివరించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ కేసులు నమోదైన వారు మీసేవలో డబ్బు చెల్లిస్తే మీటర్ కనెక్షన్ ఇస్తామని పేర్కొన్నారు. జిల్లాలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని అందరికీ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని వివరించారు.

ఎన్టీపీసీలో భద్రతా వారోత్సవాల ముగింపు



ముగింపు వేడుకల్లో రాజగోపాల్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో నిర్వహిస్తున్న 53వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలు సోమవారం జరిగాయి. ఫ్యాక్టరీస్ డైరెక్టర్ రాజగోపాల్ పాల్గొని మాట్లాడుతూ ఎన్టీపీసీ సంస్థ విద్యుత్ ఉత్పత్తిలో చేపడుతున్న కార్యక్రమాలు భేషుగ్గా ఉన్నాయన్నారు. పనిస్థలాల్లో రక్షణ చర్యలకు సంబంధించిన ప్లకార్డులు, సేఫ్టీ ఎమర్జెన్సీ నంబర్లు రాయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వై.గంగాధర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు, అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

జీరో.. తిప్పలు!



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు గడ్డం పోశెట్టి. కమాన్‌పూర్ మండలం సిద్దిపల్లికి చెందిన ఇతను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల వరకు జీరో విద్యుత్ బిల్లు కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే రెండు రోజుల క్రితం విద్యుత్‌శాఖ ఇచ్చిన విద్యుత్ బిల్లులో 95 యూనిట్లు వాడుకున్నా జీరో బిల్లు రాక రూ.429 వచ్చింది. ఇదేంటని విద్యుత్‌శాఖ అధికారులను అడిగితే మాకేం తెలియదని, మళ్లీ ఎంపీడీవో ఆఫీస్‌కెళ్లి దరఖాస్తు చేసుకోవాలని అనడంతో ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకునేందుకు భారీ క్యూలైన్‌లో నిల్చున్నాడు. ఇతనే కాదు జిల్లాలో చాలా మంది లబ్ధిదారులు జీరో బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

- దరఖాస్తు చేసినా వర్తించని విద్యుత్ సబ్సిడీ
- కరెంటు బిల్లు రావడంతో అయోమయంలో లబ్ధిదారులు
- ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాలకు పరుగులు
- తప్పుల సవరణకు మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్న వైనం



పెద్దపల్లి మున్సిపాలిటీలో మరోసారి దరఖాస్తు చేసుకుంటున్న వినియోగదారులు

సాక్షి, పెద్దపల్లి: జీరో విద్యుత్ బిల్లు వస్తుందని ఆశపడిన అర్హులైన చాలా మంది లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో నిరాశే ఎదురవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం అమలులో భాగంగా ఈనెల 1వ తేదీ నుంచి జీరో బిల్లుల పంపిణీ మొదలు కాగా జిల్లాలో వేలసంఖ్యలో అర్హత కలిగిన వారికి రాయితీ బిల్లులో చూపించడం లేదు. దీంతో తెల్లరేషన్‌కార్డు ఉండి, 200 యూనిట్ల కన్న తక్కువ విద్యుత్ వాడిన వినియోగదారులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరడం లేదు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా రాయితీ లేకుండా బిల్లు ఇస్తుండటంపై వినియోగదారులు ప్రశ్నిస్తే మీటరు సర్వీస్ నంబర్ తప్పుగా నమోదు చేయడం, రేషన్ కార్డుకు అనుసంధానం కాకపోవడం జరిగి ఉంటుందని, మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సమాధానం చెబుతున్నారు. దీంతో లబ్ధిదారులు మున్సిపాలిటీ, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

తప్పిదాలతోనే..

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా గతేడాది డిసెంబర్ 28 నుంచి జనవరి 6వరకు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుల్లో గృహజ్యోతి పథకం కోసం జిల్లావ్యాప్తంగా 2,31,341 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో గృహజ్యోతి పథకం కోసం 2,02,721 మందిని అర్హులుగా తేల్చారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో వివరాలు నమోదుగా తప్పు చేయటంతోనే సమస్యలు వచ్చాయని లబ్ధిదారులు వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపమో, క్షేత్రస్థాయి సిబ్బంది తప్పిదమో తెలియక అర్హులు అయోమయంలో పడుతున్నారు. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తుల్లో తప్పులు ఉండటం వల్లనే గృహజ్యోతి అమలు కావడం లేదని అధికారులు అంటున్నారు.

లాగిన్ కష్టాలు

జీరో బిల్లుల కోసం మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లిన లబ్ధిదారులు క్యూలైన్స్‌లలో నిరీక్షించాల్సి వస్తోంది. లాగిన్ సమస్యలతో గంటల తరబడి వేచిచూడాల్సి వస్తుండటంతో అధికారులు దరఖాస్తులు తీసుకొని, పిలిచినప్పుడు రావాలని పంపిస్తున్నారు. దీంతో రోజువారీ కూలీపనులు చేసేవారు, చిరు ఉద్యోగులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ ఎస్ఈ సుదర్శన్‌ను వివరణ కోరగా తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కరెంటు సర్వీస్ నంబర్ నమోదు చేస్తే తమ ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుందని, సదరు ఓటీపీ కొట్టితే, ప్రస్తుతం ఇచ్చిన విద్యుత్ బిల్లు కూడా జీరో బిల్లుగా మారుతుందని తెలిపారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు



గోదావరిఖనిలోని మార్కండేయకాలనీలో ఉంటున్నాం. ప్రజాపాలనలో గ్యారెంటీ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న. అందరికీ గృహజ్యోతి వచ్చింది. మాకు రాలేదు. కరంటోళ్లను అడిగితే మున్సిపల్‌లో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. మున్సిపాలిటీలో దరఖాస్తు చేసుకునేందుకు వస్తే గృహజ్యోతి కింద ఆన్‌లైన్ కాలేదని, మళ్లీ ప్రభుత్వం అవకాశం ఇస్తే ఆన్‌లైన్ చేస్తామని సిబ్బంది చెబుతున్నారు. ఈ ఆన్‌లైన్ విధానం అర్థం కావడం లేదు. అయోమయంగా ఉంది. – బొజ్జ రవికుమార్, గోదావరిఖని

జీరో బిల్లు రాలేదు



మాకు రేషన్ కార్డు ఉంది. గ్యారెంటీ పథకాల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న. అయినా మాకు జీరో బిల్లు రాలేదు. దీంతో మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి ఉదయం దరఖాస్తు ఇచ్చా. మళ్లీ పిలుస్తామన్నారు. సాయంత్రం అయినా ఇప్పటివరకు పిలవలేదు. అర్హులైన వారికి హామీ ఇచ్చిన మేరకు రాయితీ ఇవ్వాలి. – సాదుల స్వరూప, కాల్వశ్రీరాంపూర్

నాడు సింహగర్జన.. నేడు కదనభేరి

- గులాబీమయమైన కరీం'నగరం'
- లక్ష మంది సమీకరణకు ఏర్పాట్లు
- నేడు కేసీఆర్ రాక

సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్: దశాబ్దాల పాటు తెలంగాణ ప్రజలు కోరుకున్న స్వరాష్ట్ర సాధన లక్ష్యంగా ఉద్యమ పార్టీగా పురుడు పోసుకున్న నాటి టీఆర్ఎస్, ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ కలిసొచ్చిన కరీంనగర్ గడ్డపై నుంచే పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టేందుకు సిద్ధమైంది. మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాల గ్రౌండ్‌లో లక్ష మందితో పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా 'కరీంనగర్ కదనభేరి' పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించి ఎన్నికల ప్రచార శంఖారావం పూరించనున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం చవిచూసిన అనంతరం పార్టీ అధినేత కేసీఆర్ మొదటిసారిగా కరీంనగర్‌కు రానున్న నేపథ్యంలో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల 7న కరీంనగర్‌లో సమావేశం ఏర్పాటు చేసి సభ ఏర్పాట్లు, కాంగ్రెస్, బీజేపీల వైఖరి, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ, బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ కరీంనగర్‌లోనే మకాం వేసి వారం రోజులుగా సభ ఏర్పాట్లపై కార్యకర్తలకు దిశానిర్దేశనం చేశారు.



సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్

లక్ష మంది సమీకరణకు..

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల నుంచి లక్ష మందికిపైగా జనాన్ని సమీకరించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్, కరీంనగర్, సిరిసిల్లలో బీఆర్ఎస్ విజయం సాధించగా చొప్పదండి, మానకొండూర్, హుస్నాబాద్, వేములవాడలో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. పార్లమెంట్ పరిధిలో వచ్చిన ఓట్లను పరిగణనలోకి తీసుకుంటే కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్‌కే 5వేల పైచిలుకు ఓట్లు అధికంగా వచ్చిన విషయాన్ని కార్యకర్తలకు వివరిస్తూ భరోసా నింపే ప్రయత్నం చేస్తున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజక వర్గాల్లో కాంగ్రెస్‌కు 5,12,352 ఓట్లు రాగా బీఆర్ఎస్‌కు 5,17,601, బీజేపీకి 2,50,400 ఓట్లు వచ్చాయని, పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ సీట్ల సంఖ్య తగ్గినా ఐదువేల పైచిలుకు మెజార్టీ బీఆర్ఎస్‌కే ఉందని, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తే గెలుపు తథ్యమనే వాదనను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం బీఆర్ఎస్ పార్టీ చేస్తుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 3 నెలలు గడిచాయని, వారు ఇచ్చిన హామీలు అమలు కాక ప్రజలు అసహనంతో ఉన్నారని, బీజేపీ ఎంపీ బండి సంజయ్ ఐదేళ్లల్లో చేసిన అభివృద్ధి పెద్దగా ఏమీ లేదనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి మరోసారి ఎంపీ సీట్లను బీఆర్ఎస్ కైవసం చేసుకునే దిశగా కార్యకర్తల్లో మనోనిబ్బరాన్ని నింపుతున్నారు.

కరీంనగర్ గులాబీమయం

కరీంనగర్ 'కదనభేరి' బహిరంగ సభ ఏర్పాట్లతో నగరం గులాబీమయమైంది. ప్రధాన కూడళ్లతో పాటు ఎస్సారార్ కళాశాలకు వెళ్లే రహదారి మొత్తం గులాబీ జెండాలు, పార్టీ అధినేతల కటౌట్లతో సిద్ధం చేశారు. ఎస్సారార్ మైదానంలో సభ ఏర్పాట్లకు సంబంధించి వాహనాల పార్కింగ్, తదితర పనులన్నీ పూర్తయ్యాయి.

సమయపాలన పాటించకుంటే సస్పెండ్ చేస్తా



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్లు శ్యాంప్రసాద్‌లాల్, అరుణశ్రీ

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- ప్రజావాణికి ఆలస్యంగా వచ్చే అధికారులపై ఆగ్రహం
- పెండింగ్ దరఖాస్తులపై శ్రద్ధ చూపాలని ఆదేశం

పెద్దపల్లిరూరల్: ప్రజావాణి కార్యక్రమానికి సకాలంలో చాలామంది అధికారులు హాజరుకావడం లేదు.. ఇదే పరిస్థితి ఉంటే అలాంటి వారిని సస్పెండ్ చేస్తా ..నంటూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్‌లతో కలిసి వినతులు స్వీకరించారు. ప్రజావాణిలో అందే దరఖాస్తులకు ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలని చాలాసార్లు చెప్పినా కొందరు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారన్నారు. ఒకే సమస్య కోసం పదేపదే రావడం మీ పనితీరును తెలియజేస్తోందన్నారు. ఇక మీదట ఇలాంటి పరిస్థితి ఉండరాదన్నారు. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళితే భాద్యతగల మరో అధికారిని పంపించాలన్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజల పట్ల కార్యాలయ అధికారులు, సిబ్బంది అమర్యాదగా ప్రవర్తిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఇలాంటి పరిస్థితులు పునరావృత్తం కావొద్దన్నారు. ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పెన్షన్ ఇప్పించండి

దివ్యాంగుడినైన తనకు సదరం సర్టిఫికెట్ ఉన్నా పెన్షన్ మంజూరు చేయడం లేదు. ఈ విషయమై పూర్తి విచారణ జరిపి తనకు ఫించన్ మంజూరు చేయాలి.

– తోట సంతోష్, కొలనూర్, ఓదెల

కొడుకు నుంచి రక్షణ కల్పించాలి

తనకు ఆస్తిని పంచి ఇవ్వాలంటూ తమ కుమారుడు నన్ను, నా భార్యను చిత్రహింస పెడుతున్నాడు. కొడుకు నుంచి మాకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలి. – నూతి రామస్వామి, జ్యోతినగర్ పెద్దపల్లి

రైతు రుణాలపై స్పెషల్‌డ్రైవ్

- స్వశక్తి మహిళలకు స్వయం ఉపాధి యూనిట్లు
- బ్యాంకర్లతో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: జిల్లా రైతాంగం పంటసాగుకు అవసరమైన రుణాలను రెన్యువల్ చేసుకునేందుకు వీలుగా స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో నిర్వహించిన జిల్లాస్థాయి సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,854కోట్ల పంట రుణ లక్ష్యాన్ని ఎంచుకున్నామన్నారు. డిసెంబర్ ఆఖరునాటికి రూ.833 కోట్లు, అందించామని తెలిపిన అధికారులు 44.92 శాతం సాధించామని పేర్కొనడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీ విషయమై రైతుల్లో ఉన్న సందేహాలను నివారించేందుకు స్పెషల్‌డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. కోల్డ్‌స్టోరేజీ, వేర్‌హౌజ్, సీడ్ ప్రొడక్షన్, తదితర కార్యక్రమాలకు సైతం రుణాలు మంజూరు చేసే అవకాశముందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మహిళాసంఘాలకు ఉపాధియూనిట్లు మంజూరు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. స్టాండప్ ఇండియా పథకం కింద ఇప్పటివరకు 108 యూనిట్లకు రూ.1,849 కోట్ల రుణాలు అందించామన్నారు. ముద్ర రుణాలుగా 15,453 మందికి రూ.129కోట్ల78లక్షల రుణాలు పంపిణీ చేశామని వివరించారు. పీఎం విశ్వకర్మ పథకంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 3,147 దరఖాస్తులు అందాయన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్, డీఆర్‌డీవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపు కోసమే తుపాకీ రాముడి మాటలు



మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: రాబోయే ఎంపీ ఎన్నికల్లో గెలుపు కోసం రామగుండం ఎమ్మెల్యే తుపాకీ రాముడి మాటలు మాట్లాడుతున్నాడని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం ప్రధానచౌరస్తాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం తెచ్చిన నిధులనే తమ ప్రభుత్వంలోనే వచ్చినట్లు చెప్పుకుంటూ ప్రజలకు పచ్చి అబద్ధాలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో అభివృద్ధి జరిగినా ఏమి జరగలేదని చెప్పడం సరికాదన్నారు. డీఎంఎఫ్‌టీ నిధులు రూ.56 కోట్లు, సీఎం గ్రాంట్ నిధులతో ఈప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రభుత్వం మారడంతో పనులు ఆగాయని ఈ ప్రభుత్వం గత జీవోలను కొనసాగిస్తూ పనులు కొనసాగించాల్సిన బాధ్యత ప్రస్తుత ఎమ్మెల్యేపై ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా బరిలో నిలబడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించి పట్టం కట్టాలని కోరారు. ఈనెల 12న కరీంనగర్‌లో తలపెట్టిన కేసీఆర్ సభను విజయవంతం చేయాలని అన్నారు. సమావేశంలో నాయకులు కౌశిక హరి, గోపు ఐలయ్యయాదవ్, నడిపెల్లి మురళీధర్‌రావు, పెంట రాజేశ్, ముదాం శ్రీను, మాదాసు రామ్మూర్తి, ఎన్.మారుతి, పర్లపల్లి రవి, తోడేటి శంకర్‌గౌడ్, అచ్చె వేణు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధిహామీ కూలీలపై అడవిపందుల దాడి

- కందకాలు తవ్వుతున్న ముగ్గురు కూలీలకు గాయాలు
- వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలింపు


గాయపడ్డ శంకరవ్వ

చందుర్తి(వేములవాడ): రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన ఇద్దరు ఉపాధిహామీ కూలీలపై అడవి పందులు దాడి చేసి గాయపర్చాయి. నర్సింగాపూర్‌కు చెందిన ఉపాధిహామీ కూలీలు లొంక హనుమండ్లు అటవీ ప్రాంతంలో కందకాలను తవ్వేందుకు 60 మంది కూలీలు వెళ్లారు. కందకాలు తవ్వుతున్న సమయంలో పందులు గుంపుగా రావడంతో భయపడిన కూలీలు పరుగులు తీశారు. ఇదే సమయంలో పలువురు మహిళలపై పందులు దాడి చేయడంతో బైరగోని శంకరవ్వ, ఆరెల్లి నర్సవ్వ, ఆరెల్లి లచ్చవ్వలకు గాయాలయ్యాయి. వీరిని వెంటనే వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన శంకరవ్వను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఉపాధిహామీ ఏపీవో రాజయ్య మాట్లాడుతూ స్వల్ప గాయాలైనట్లు తెలిపారు.

బాలిక పరిస్థితి విషమం

కోరుట్ల: జగిత్యాల జిల్లాకు చెందిన ఓ బాలికను కిడ్నాప్ చేసి.. వేములవాడలోని ఓ లాడ్జిలో లైంగికదాడికి పాల్పడిన భీమారం మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన మైదం సాయికుమార్‌పై వేములవాడ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అత్యాచారానికి గురైన బాలిక పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. బాలికను కరీంనగర్ సివిల్ ఆసుపత్రిలో ఉంచి ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స అందిస్తున్నారు. బాలికకు తీవ్ర రక్తస్రావం కావడంతో బీపీ పడిపోయి పరిస్థితి ఇబ్బందికరంగా ఉండడంతో బంధువులు ఆందోళనకు గురవుతున్నారు.

బీటెక్ ఫలితాల్లో ట్రినిటి విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రశాంత్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజినీరింగ్ విద్యార్థులు బీటెక్ ఫస్టియర్ ఫలితాల్లో సత్తాచాటారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ విభాగంలో ఫయాజ్ 93శాతం, తబసుం సుల్తానా 89శాతం, కంప్యూటర్ సైన్స్‌లో నిఖిత 90శాతం, దీప్తి 89.5శాతం ఫలితాలు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. వీరిని విద్యాసంస్థల చైర్మన్ ప్రశాంత్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశన్, సురేశ్, పద్మిని, ఆంజనేయులు, శ్రీనివాస్, మహేందర్, కిషన్ తదితరులు అభినందించారు.

నాన్న.. నాకు మాట్లాడాలని ఉంది

- మాటల కోసం తపిస్తున్న మూగ గొంతు
- ఆపరేషన్ల ఖర్చులతో అప్పులపాలైన తండ్రి
- హియరింగ్ మిషన్‌ల కొనుగోలుకు చిల్లిగవ్వ లేని వైనం
- దాతల సాయం కోసం ఎదురుచూపు


తండ్రి రాజశేఖర్‌తో రిషిత

కరీంనగర్‌టౌన్: ఆ కుటుంబంలో మొదటి సంతానంగా పాప జన్మించింది. ఇంట్లో లక్ష్మీదేవి పుట్టిందని సంబరపడ్డారు. ఆ సంబరం ఏడాది తిరగకముందే ఆవిరైంది. పాపకు మాటలు రాకపోవడంతో ఆసుపత్రుల చుట్టూ తిరిగారు. ఆస్తులు అమ్ముకొని కొంత, దాతల సహకారంతో కొంత సొమ్ము సేకరించి కేంద్ర ప్రభుత్వ పథకంతో ఆపరేషన్ చేయించినా, లక్షల్లో ఖరీదు చేసే హియరింగ్ మిషన్ల కొనుగోలుకు డబ్బుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాపకు మాటలు రావాలంటే మిషన్లకు, హియరింగ్ థెరపీకి రూ.11 లక్షలు అవసరముండడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

కూతురు తపన.. తండ్రి ఆవేదన

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం రంగసాయిపల్లె గ్రామానికి చెందిన పోతు రాజశేఖర్, కావ్యశ్రీ దంపతులకు 2016లో రిషిత జన్మించింది. ఆరోగ్యంగానే ఉన్న పాప ఏడాది వయస్సు వచ్చినా మాట్లాడకపోవడంతో అనుమానం వచ్చి ఆసుపత్రిలో చూపించారు. అన్ని పరీక్షలు నిర్వహించిన వైద్యులు పాపకు పుట్టుకతోనే మూగ, చెవుడు సమస్య ఉన్నట్లు గుర్తించారు. స్పీచ్ థెరపీతో మాటలు వస్తాయని చెప్పడంతో 2017లో తిరుపతిలోని శ్రవణం స్పీచ్ థెరపీ ఆస్పత్రిలో ఏడాదిపాటు ఉండి చికిత్స అందించారు. అయినా ఫలితం లేకపోవడంతో 2018లో దాతల సాయంతో రూ.1.5 లక్షలతో వినికిడి యంత్రం కొనుగోలు చేసినా పాపకు ఉపయోగపడలేదు. మళ్లీ 2019లో హైదరాబాద్ అపోలో ఆస్పత్రికి వెళ్లగా ఆపరేషన్ చేస్తే నయం అవుతుందని తెలిపారు. ఆపరేషన్‌కు రూ.15 లక్షలు ఖర్చవుతాయని చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. కేంద్ర పథకం అడిప్ స్కీం కింద అవకాశం ఉండడంతో దరఖాస్తు చేసుకున్నారు. అడిప్ స్కీం కింద తల లోపల కాక్లర్ ఇంప్లాట్ మిషన్ వేశారు. ఆపరేషన్ చేయడం ఒక ఎత్తయితే, తర్వాత హియరింగ్ మిషన్ కొనుగోలు చేయడం తలకుమించిన భారంగా మారింది. ఆపరేషన్ తర్వాత ప్రతీ రెండు నెలలకోసారి ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించాలి. ఈ క్రమంలో చెవిలో ఇన్‌ఫెక్షన్ సోకడంతో 2022లో మరోసారి ఆపరేషన్ చేయించారు. ఓ బిల్డర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేసుకునే రాజశేఖర్ తరచూ బిడ్డను ఆసుపత్రులకు తీసుకెళ్తున్న క్రమంలో ఉద్యోగం కూడా పోయింది. దీంతో ఇల్లు గడవడం కష్టంగా మారింది. ఊళ్లో ఉన్న ఇల్లు అమ్మినా అప్పులు తీరలేదు. ప్రస్తుతం రేకుర్తిలో ఉంటున్నారు. రిషిత మాట్లాడాలంటే కుడి చెవికి రూ.7.5 లక్షల విలువైన న్యూక్లియర్-8 మిషన్, ఎడమ చెవికి రూ.1.5 లక్షల మరో మిషన్ అవసరముంది. వీటిని కొనుగోలు చేసినా ప్రతినెలా రూ.13 వేలు వెచ్చించి రెండేళ్లపాటు స్పీచ్ థెరపీ అందించాల్సి ఉంటుంది. సుమారు రూ.11 లక్షలు ఖర్చు చేస్తే తప్ప పాప మూగ గొంతుకు మాటలు వచ్చే అవకాశం లేదు. ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయిన రాజశేఖర్ కూతురు కోసం రోదిస్తున్నాడు. పాపపై కరుణతో హృదయమున్న దాతలు సహకరించాలని వేడుకుంటున్నాడు.

రాజశేఖర్‌కు సహాయం చేయాలనుకునేవారు:

అకౌంట్ నంబర్ :
20343433912
ఎస్‌బీఐ బ్యాంకు
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0014237
ఫోన్‌పే/గూగుల్‌పే నంబర్ :
77024 88503

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు


నర్సింగాపూర్‌లో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

ధర్మారం: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామశివారులోని సర్వే నం.215, 273, 284లో గల ప్రభుత్వ భూములను పరిశీలించారు. ప్రభుత్వ భూమిలను అనర్హులు కబ్జా చేసుకోవడంతో పాటు పట్టాసర్టిఫికెట్ల కంటే అదనంగా సాగుచేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయన్నారు. మోకాపై లేకున్నా కొందరు అధికారుల తప్పిదాలతో రికార్డుల్లో నమోదు చేసుకుని ప్రభుత్వ పథకాలు పొందుతున్నారని అన్నారు. వీటన్నింటిపై సమగ్ర నివేదిక తయారు చేసి అందించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ రజిత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వరలక్ష్మి, సర్వేయర్ నరేశ్, సిబ్బంది ఉన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని మినీ కలెక్టరేట్ ప్రాంగణంలో గల తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌తో కూడిన చలివేందార్ని సోమవారం అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ ప్రారంభించారు. వేసవిలో ఎండ దెబ్బ తగలకుండా ఉండేందుకు చలివేంద్రాలు దోహదపడుతాయన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో చలివేంద్రాలు ప్రారంభించాలని సూచించారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, కమిషనర్ వేణుమాధవ్, నాయబ్ తహసీల్దార్ మహేశ్, అధికారులు పాల్గొన్నారు.

సింగరేణిలో పోస్టుల భర్తీపై సీఅండ్‌ఎండీ సమీక్ష


సమీక్షా సమావేశంలో సింగరేణి సీఅండ్‌ఎండీ బలరాం

గోదావరిఖని: సింగరేణిలో భారీగా పోస్టులు భర్తీ చేసేందుకు సంస్థ సీఅండ్‌ఎండీ ఎన్.బలరాం సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించి ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్స్, త్వరలో ఇవ్వాల్సిన నోటిఫికేషన్స్‌పై చర్చించారు. గతనెలలో సింగరేణి సంస్థలో మొత్తం 321 పోస్టులను ప్రత్యక్ష నియామకాల పద్ధతిలో భర్తీ చేయుటకు మొదటి విడతగా 272 పోస్టుల భర్తీకి తేదీ గతనెల 22న నోటిఫికేషన్ జారీ చేశారు. అంతర్గత పోస్టుల భర్తీకిగాను 173ఖాళీలను నోటిఫికేషన్ విడుదల చేశారు. వీటితో పాటు త్వరలో ఎక్స్‌టర్నల్, ఇంటర్నల్ పోస్టుల భర్తీ కూడా పెద్ద ఎత్తున చేపట్టేందుకు చర్చించారు. త్వరలో ఎక్స్‌టర్నల్ ద్వారా 279 పోస్టులు, అంతర్గతంగా 1073 పోస్టులను విభాగాల వారీగా భర్తీ చేసేందుకు కసరత్తు నిర్వహించారు. త్వరలో మరో నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డైరెక్టర్ ఎస్వీకే శ్రీనివాస్, ఈఅండ్‌ఎం డైరెక్టర్ డి.సత్యనారాయణరావు, ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం బసవయ్య, ఐఆర్‌అండ్‌పీఎం జీఎం హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోల కేంద్ర సంఘం అధ్యక్షుడికి సన్మానం



జగదీశ్వర్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కరీంనగర్ అర్బన్: టీఎన్జీవోల కేంద్ర సంఘం అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన మారం జగదీశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికవడం పట్ల ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వెలిబుచ్చారు. ప్రస్తుతం కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతుండగా సోమవారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా జగదీశ్వర్ గతంలో టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించిన విషయం విదితమే. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో అలుపెరగని కృషి చేశారు. అధ్యక్షుడిగా ఎన్నికవడం పట్ల ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు ఆనందం వ్యక్తం చేశారు. భారీగా టపాసులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. రాష్ట్ర, జిల్లా నేతలు నాగుల నర్సింహస్వామి, చంద్రశేఖర్, హరికృష్ణ, మారుపాక రాజేశ్‌భరద్వాజ్, కోట రామస్వామి, ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, సర్దార్ హర్మిందర్‌సింగ్, నేరేళ్ల కిషన్, గూడ ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, రాజమనోహర్, జగన్‌గౌడ్, అభిషేక్‌రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

4 ఉమ్మడి జిల్లాలకు సింగరేణి స్థానికత

- బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ కార్పొరేషన్: ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలు సింగరేణి స్థానికత కలిగి ఉంటాయని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాల పునర్విభజనతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాలు సిద్దిపేట జిల్లాలో కలవడం, సిద్దిపేట జిల్లా హైదరాబాద్ జోన్‌లోకి వెళ్లడంతో సింగరేణి ఉద్యోగాలకు అభ్యర్థులు స్థానికత కోల్పోయారు. ఈ అంశాన్ని సోమవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి పేర్కొన్నారు. స్పందించిన ఆయన సింగరేణి సీఎండీతో మాట్లాడి, నిరుద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారన్నారు. ఉమ్మడి జిల్లాల పరిధిలోని అభ్యర్థులకు స్థానికత వర్తిస్తుందని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. దీంతో కరీంనగర్ నుంచి సిద్దిపేట జిల్లాలో కలిసిన హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాలకు న్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఇక నుంచి సింగరేణి కాలరీస్ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఉమ్మడి నాలుగు జిల్లాల నిరుద్యోగులకు అర్హత ఉంటుందన్నారు. తక్షణమే సమస్య పరిష్కారానికి చొరవ చూపిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

లీడర్‌షిప్ క్వాలిటీ కలిగి ఉండాలి


మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్

గోదావరిఖనిటౌన్: చదువుకునే ప్రతీ విద్యార్థి లీడర్‌షిప్ క్వాలిటీ కలిగి ఉండాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ అన్నారు. సోమవారం సెక్రెడ్ హార్ట్ పాఠశాలలో నిర్వహించిన ఎన్‌సీసీ స్కూల్ క్యాబినెట్స్ నూతన లీడర్స్ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ, సామాజిక సేవ, దేశంపై ప్రేమ అలవడుతుందన్నారు. అనంతరం ఢిల్లీ రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపికైన రిజియాన్ను, ప్రోత్సహిస్తున్న ఎన్‌సీసీ ఆఫీసర్ జ్యోత్స్న, డ్యాన్సర్ విద్యాలయలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో 9వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ దానియల్ లాడ్జమ్, ఫాదర్ రాయపురెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ లవ్‌లీ జాకబ్, ప్రిన్సిపాల్ జ్యోత్స్న, ప్రైమరీ ఇన్‌చార్జి ఇన్నమ్మ, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

అట్టహాసంగా 'అల్ఫోర్స్ అస్త్ర'


నృత్యం చేస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి(కరీంనగర్): అల్ఫోర్స్ అస్త్ర పేరిట సోమవారం రాత్రి రేకుర్తి ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన కరీంనగర్‌లోని భగత్‌నగర్ అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల వార్షికోత్సవం అట్టహాసంగా సాగింది. ఈ వేడుకలను విద్యా సంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి ముఖ్య అతిథి, ప్రముఖ పోటీ పరీక్షల శిక్షకురాలు ఎం.బాలలతతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో విద్యార్థులు సవాళ్లను ఎదుర్కొంటూ అనుకున్న లక్ష్యాలను సాధించి, తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. బాల్య దశ నుంచే విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తూ వారు ఉత్తమ ఫలితాలు సాధించేలా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి


రేవెల్లి రాయమల్లు మృతదేహం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడు పెద్దచెరువులో ప్రమాదవశాత్తు పడి పశువుల కాపరి రేవెల్లి రాయమల్లు (34) మృతి చెందాడు. ఏఎస్సై రామస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. జూలపల్లి మండలం కాచాపూర్‌కు చెందిన రాయమల్లు బసంత్‌నగర్‌కు చెందిన బరిగెల రాములు పశువులను కాసేందుకు పని కుదుర్చుకున్నాడు. రోజులాగే సోమవారం పశువులను మేతకు తీసుకెళ్లిన రాయమల్లు వాటికి నీరు తాగించేందుకు చెరువులోకి దింపే క్రమంలో తాను చెరువులోకి దిగాడు. చెరువులో ఉన్న కయ్యలో పడ్డ రాయమల్లు నీటమునిగి దుర్మరణం పాలయ్యాడు. మృతుడికి భార్య స్వరూప, ఇద్దరు ఆడపిల్లలున్నారు. నిరుపేద కుటుంబీకుడైన రాయమల్లు కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని మృతుడి బంధువులు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. పెద్దపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి క్వింటాల్ ధర రూ.7,551

పెద్దపల్లిరూరల్: వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో సోమవారం పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,551 పలికింది. కనిష్టంగా ధర రూ.6,011 కాగా, సగటు ధర రూ. 7,373గా నమోదైందని మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

బకాయి వేతనాలు చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు

పెద్దపల్లిరూరల్: బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన కార్మికులు అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందించారు. పల్లెల్లో అతితక్కువ వేతనంపై పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోతే కుటుంబమంతా పస్తులుండే పరిస్థితులున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు, కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి ఖాజా అన్నారు. ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులందరికీ వినతులు సమర్పించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే తాము సమ్మెకు దిగుతామని తెలిపారు. నాయకులు లచ్చయ్య, నరేశ్, శ్రీనివాస్, అశోక్, నాగయ్య, లక్ష్మణ్, నర్సయ్య, రామస్వామి, రాజయ్య, భాస్కర్ పర్శరాములు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు అందించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు అందించాలని ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రాజెక్టులోని సీహెచ్‌పీ ప్యాకేజ్ ఫోర్‌షిప్ట్ ఆపరేషన్‌లో పనిచేస్తున్న 80 మంది కార్మికులకు సంబంధిత కాంట్రాక్టర్ సూర్య తేజ నేటి వరకు జీతాలు చెల్లించడం లేదని ఆరోపించారు. కార్మికులు వేతనాలు సకాలంలో అందక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలవెన్సులు చెల్లించకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఒక్కో కార్మికుడికి రూ. 2000 నుండి 3000 వరకు అలవెన్సులలో కోత విధించడంపై అసహనం వ్యక్తం చేశారు. పండుగ సెలవుల్లో విధులు నిర్వహించినా సింగిల్ మాస్టర్ ఇస్తున్నారని అన్నారు. కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మూడు నెలలుగా యాజమాన్యం వద్దకు వెళ్లినా ఫలితం కనిపించడం లేదన్నారు. కార్మికులకు సరైన న్యాయం చేయకపోవడంతో నిరసన చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు చిలుక శంకర్, లక్ష్మణ్, శ్రీనివాస్, రాజమల్లయ్య, భూమయ్య, గీట్ల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

పెద్దపల్లిరూరల్: ఇళ్లు లేని తమకు గత ప్రభుత్వం మంజూరు చేసిన డబుల్‌బెడ్రూం ఇళ్లను వెంటనే కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారని, ఆ జాబితా ప్రకారమే ఇళ్లు కేటాయించాలని లబ్ధిదారులు కోరారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న నరేశ్

గోదావరిఖని: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈ.నరేశ్ డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతాంగ పోరాట ఫలితంగా ఆరు నెలల్లో పరిష్కరిస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం రెండేళ్లయినా ఒక్క హామీని కూడా అమలు చేయకుండా రైతాంగ ఉద్యమాలను అణిచివేయాలని చూస్తోందన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఈనెల 14న జిల్లా కేంద్రంలో జరిగే ఆందోళనలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఐ.కృష్ణ, ఎ.వెంకన్న, బి.అశోక్, చిలుక శంకర్, ఎం.దుర్గయ్య, ఎడ్ల రవికుమార్, తిప్పని రాంకీ, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

భార్యతో సన్నిహితంగా ఉన్నందుకే హత్య

- హతమార్చి వేములవాడ దర్శనానికి నిందితుడు
- 48 గంటల్లోనే ఛేదించిన పోలీసులు


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ రఘుచందర్

రాయికల్: తన భార్యతో సన్నిహితంగా ఉన్నందుకే నాగెల్లి భూమేశ్.. సురేశ్ అనే యువకుడిని హత్య చేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. శుక్రవారం జరిగిన హత్య నేరానికి సంబంధించిన వివరాలను సోమవారం రాయికల్ ఠాణాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. రాయికల్ మండలం తాట్లవాయికి చెందిన నాగెల్లి సురేశ్, నాగెల్లి భూమేశ్ వరుసకు అన్నదమ్ముల్లు. భూమేశ్ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. ఈ క్రమంలో సురేశ్ భూమేశ్ భార్యతో సన్నిహితంగా ఉంటున్నాడని స్నేహితుల ద్వారా తెలుసుకున్నాడు. ప్రవర్తన మార్చుకోవాలని పలుమార్లు హెచ్చరించినా సురేశ్ పట్టించుకోలేదు. 2023 అక్టోబర్‌లో దుబాయ్ నుంచి ఇంటికి వస్తూనే సురేశ్‌ను చంపాలనే ఉద్దేశంతో వెంట కత్తి తెచ్చుకున్నాడు. ఇంటికి వచ్చిన తర్వాత కూడా భార్యతో సన్నిహితంగా మెలగడాన్ని గమనించాడు. దీంతో సురేశ్‌పై పగ పెంచుకుని, ఎలాగైనా చంపాలని అనుకుని ఈనెల 7న ఉదయం పొలం వద్దకు నీరు పెట్టడం కోసం సురేశ్ వెళ్లడాన్ని గమనించాడు. ప్లాన్ ప్రకారం కత్తిని తీసుకుని తన ద్విచక్రవాహనంపై పొలం వద్దకు వెళ్లాడు. పొలానికి కొద్దిదూరంలో ఉన్న చెరువు కట్టపై ద్విచక్ర వాహనాన్ని పెట్టాడు. తన పొలానికి నీరు పెట్టేందుకు ద్విచక్రవాహనంపై వస్తున్న సురేశ్‌ను ఆపి తాను పొలానికి వస్తున్నానని చెప్పాడు. పొలం గట్టుదగ్గర ద్విచక్ర వాహనాన్ని ఆపగానే భూమేశ్ వెంట తెచ్చుకుని కత్తితో సురేశ్ తల, మెడపై విచక్షణరహితంగా నరికాడు. కిందపడిన సురేశ్ ప్రాణభయంతో బావి వైపు పరుగెత్తుతుండగా మరోసారి నుదుటిపై, తలపై కత్తితో నరికాడు. దీంతో తీవ్రంగా గాయాలైన సురేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. సురేశ్ మృతదేహాన్ని అదే బావిలోకి తోసేశాడు. కత్తిని కూడా అదే బావిలో పడేశాడు. రక్తం మరకలు శుభ్రం చేసుకుని తన ద్విచక్ర వాహనంపై ఇంటికొచ్చి స్నానం చేసి అనంతరం వేములవాడ రాజన్న (శివరాత్రి జాతర) దర్శనానికి వెళ్లాడు. సురేశ్ ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లారు. అప్పటికే సురేశ్ బావిలో శవమై కనిపించాడు. హత్య విషయాన్ని తెలుసుకున్న రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్, ఎస్సై అజయ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. సురేశ్ తల్లి నాగెల్లి లక్ష్మి భూమేశ్‌పై అనుమానం ఉందని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న భూమేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా.. తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడిచ్చిన సమాచారం మేరకు బావిలో పడేసిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే హత్య సమయంలో వినియోగించి రెండు మొబైల్స్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. 48 గంటల్లో నిందితుడిని పట్టుకున్న సీఐ, రాయికల్ ఎస్సైలను డీఎస్పీ అభినందించారు.

'ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు సహించం'


రాంచందర్‌ను సన్మానిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు

గోదావరిఖనిటౌన్: దక్షిణాది రాష్ట్రాలు, తెలంగాణ, ఆంధ్రతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు, ఉద్యోగుల ప్రమోషన్లలో నష్టం వాటిల్లితే సహించేదిలేదని నేషనల్ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ అన్నారు. స్వర్ణభారతి భవన్‌లో సోమవారం ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీల సాధక బాధకాల్లో అణగారిన ప్రజలకు ఎస్సీ కమిషన్ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. అనంతరం రాంచందర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బొంకూరి మధు, మైస రాజేశ్, కొంకటి లక్ష్మణ్, మంథెన లింగయ్య, నెరువట్ల రాజలింగం, మంథెన శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఫెడరేషన్ కమిటీ నియామకం

జ్యోతినగర్: ఎన్టీపీసీ ఆరో ఆల్ ఇండియా ఎన్టీపీసీ ఫెడరేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతీయస్థాయిలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా బాబర్ సలీంపాషా, ఉపాధ్యక్షులుగా ఆరెపల్లి రాజేశ్వర్, బండారి కనకయ్య, వెంకటస్వామి, కార్యదర్శిగా వేముల కృష్ణయ్య, శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా భాస్కర్, వెంకటరెడ్డిలతో పాటు పలువురు ఎన్నికయ్యారు. నూతనంగా నియమితులైన వారిని ఎన్టీపీసీ ఉద్యోగ గుర్తింపు సంఘం కమిటీ సభ్యులు అభినందించారు.